క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



కేటీదొడ్డి: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏఈఓ భరత్‌సింహ అన్నారు. శనివారం మండలంలోని చింతలకుంట గ్రామంలోని జాతీయ ఆహారభద్రతా పథకం కింద అర్హులైన రైతులకు నాలుగు కేజీల కంది విత్తనాలు ఉచితంగా అందజేశారు. రైతులు నాణ్యమైన పంటలు పండించి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, తదితరులు ఉన్నారు.

వర్షం కోసం పూజలు

అయిజ: మండలంలోని సంకాపురం గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలని పూజలు చేస్తూ భక్తులు 24 గంటల పాటు అఖండ భజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం ఉదయం ఆంజనేయ స్వామి విగ్రహానికి మహామంగళ హారతి ఇచ్చి అఖండ భజన పూర్తి చేయనున్నట్లు భజన మండలి సభ్యులు పేర్కొన్నారు.

వీఆర్‌ఏలకు నియామక పత్రాలు ఇవ్వాలి

మానవపాడు: 61ఏళ్లు పైబడి వారసత్వం ఉన్న వీఆర్‌ఏలకు నియామకపత్రాలు అందివాలని వీఆర్‌ఏలు రాజు, లక్ష్మన్న, రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మకు వినతి పత్రం అందజేశారు.81, 85 జీఓ ప్రకారం 61 ఏళ్ల కంటే తక్కువ ఉన్న వీఆర్‌ఏలకు నియమాకపత్రాలు అందించి అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన వారికి నియామకపత్రాలు ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. వెంటనే వారికి కూడా నియామకపత్రాలు అందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వీఆర్‌ఏలు ఈశ్వరమ్మ, గోపాలమ్మ, వీరన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ

అయిజ: మండలంలో సింధనూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు పావని విద్యాసాగర్, బసవరాజీలు స్కూల్ బ్యాగులు, ఇతర వస్తువులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా దాతలు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

మానవపాడు: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో భూ భారతి ద్వారా వచ్చిన సమస్యలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాలను నేరుగా విత్తుకోవాలి

ఎర్రవల్లి: వరిని నేరుగా విత్తుకుంటే రైతులకు కూలి ఖర్చులు తగ్గడంతో పాటుగా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తిమ్మాపురంలో రైతులకు నేరుగా విత్తే పద్ధతిపై అవగాహన కల్పించారు. విత్తనాలను నేరుగా విత్తుకోవడం ద్వారా ఎకరానికి కేవలం 15కేజీల విత్తనం సరిపోతుందన్నారు. అదే విధంగా కేవలం ఒక గంట వ్యవధిలోనే ఎకరం విత్తనం వేసుకోవచ్చని తెలిపారు. విత్తనం వేసిన 15 నుంచి 20 రోజుల్లో కలుపు నివారణ కోసం మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు రాజు, ఆంజనేయులు, అంజి, వెంకట్రాముడు, సుజాత తదితరులు ఉన్నారు.

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

ధరూరు: ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే పథకాలు, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాలపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉద్యావన శాఖ అధికారి అక్బర్ తెలిపారు. ఆయిల్ ఫాం తోటల సాగు, రాయితీ వివరాలను తెలిపారు. శనివారం మండలంలోని నెట్టెంపాడులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయిల్ ఫాం సాగు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఎంఐడీహెచ్ స్కీంలో రైతులు కూరగాయల సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యావన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వాగులపై వారధి నిర్మాణమేది?



మాన్‌దొడ్డి–తుమ్మిళ్ల మధ్య తక్కువ ఎత్తులో నిర్మించిన బ్రిడ్జి

- వంతెన నిర్మిస్తే తగ్గనున్న దూరం
- వర్షాకాలంలో రాకపోకలు బంద్
- కలగానే మిగులుతున్న బ్రిడ్జి నిర్మాణం

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న వాగులు, వంకలపై వారధులను నిర్మించడంలో అలసత్వం వీడి నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రస్తుతం ఉన్న రహదారి కాకుండా మండల కేంద్రానికి చేరుకోవడానికి ఇతర రహదారులున్నాయి. వాటి నుంచి వెళ్తే దూరం తగ్గడమే కాకుండా, సమయం ఆదా అవుతుంది. ఈ వాగులపై వంతెన నిర్మిస్తే గ్రామాలకు మధ్య దూరం తగ్గి రాకపోకలు పెరుగుతాయి.

ఆయా గ్రామాల నుంచి..

మండలంలోని ముండ్లదిన్నె గ్రామం నుంచి రాజోళికి చేరుకునేందుకు ప్రస్తుతంపెద్ద తాండ్రపాడు, అశోక్‌నగర్ క్యాంపు మీదుగా వెళ్లాల్సి ఉంది. దీని వల్ల దూరభారం పెరుగుతుండగా, ముండ్లదిన్నె నుంచి రాజోళికి వెళ్లేందుకు ఎంతో కాలం నుంచి మరొక రహదారి ఉంది. దీని వల్ల 15 నిముషాల వ్యవధిలో మండల కేంద్రానికి చేరుకోవచ్చు. అయితే ఈ రహదారిలో వాగు ప్రవహిస్తుండటంతో వర్షాకాలం రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసర సమయంలో కూడా ఈ రహదారిపై వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గంలేక, వాగుపై వంతెన లేక చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించడం వల్ల కేవలం మండల కేంద్రానికే కాక రైతులకు కూడా చాలా ప్రయోజనంగా ఉంటుంది. మాన్‌దొడ్డి గ్రామం నుంచి రాజోళికి రావాలంటే 20 కి.మీ. ప్రయాణం చేయాల్సిందే. మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్లకు వెళ్లే దారిలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే చాలా తక్కువ దూరంలో మండల కేంద్రానికి చేరుకోవచ్చు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, వాహనాలు తుమ్మిళ్ల మీదుగా సుంకేసుల వద్దకు చేరుకుని కర్నూల్‌కు వెళ్లేందుకు సలువుగా ఉంటుంది. గ్రామాల మధ్య రాకపోకలు పెరుగుతాయి. దీని వల్ల పెద్దధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్ తదితర గ్రామాలకు మేలు జరుగుతుంది. తుమ్మిళ్ల గ్రామానికి ప్రారంభంలో ఉన్న వంకపై సరైన వంతెన లేక వర్షాకాలం వాహనాలు నిలిచిపోతున్నాయి. వీటితో పాటుగా రాజోళి, ముండ్లదిన్నె–కొంకల మధ్యలో ఉన్న వాగులపై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిపై మరింత ఎత్తును పెంచేలా చర్యలు తీసుకోవాలి. ఆయా గ్రామాల్లో కాలువలు, వాగుల ద్వారా నీరు తగ్గు ప్రాంతం వైపు రావడం వల్ల కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అలాంటి చోట చిన్నపాటి వంతెనలు నిర్మిస్తే వర్షాకాలం కూడా రాకపోకలకు ఇబ్బందులుండవని ప్రజలు కోరుతున్నారు.

మాన్‌దొడ్డి నుంచి చాలా దూరం



మాన్‌దొడ్డి నుంచి మండల కేంద్రం చాలా దూరం. పచ్చర్ల మీదుగా, లేదంటే శాంతినగర్ మీదుగా వెళ్లాలి. మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్లకు వెళ్లే రహదారిలో వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే చాలా గ్రామాలకు మేలు జరుగుతుంది. అత్యవసర సమయంలోను ఆపద నుంచి బయటపడేందుకు అవకాశముంటుంది. వాగుపై బ్రిడ్జి నిర్మించాలి. – ప్రకాశం, మాన్‌దొడ్డి

రైతులకు ప్రయోజనమే..



ముండ్లదిన్నె నుంచి రాజోళికి వెళ్లే వాగులో ఏడాదిలో చాలా రోజులు నీరు ఉంటుంది. దీని వల్ల మండల కేంద్రానికి వెళ్లేవారికే కాకుండా రైతులకు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందే ఉంటుంది. ఈ వాగుపై వారధి నిర్మిస్తే ఇటు వాహనాలకు, రైతులకు చాలా ప్రయోజనం చేకూరుతుంది. వాగులపై వంతెన లేకపోవడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. – ఎ.అశోక్‌రెడ్డి, ముండ్లదిన్నె

పై అధికారులకు మళ్లీ చెబుతాం..

గతంలో ఈ బ్రిడ్జిలకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఆయా గ్రామాల ప్రజలు బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిపై కాంట్రాక్టర్లతో కూడా మాట్లాడాం. త్వరలోనే వాటిని నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. వాటి ఆవశ్యకతను పై అధికారులకు తెలియజేస్తాం. – భరత్ కుమార్, పీఆర్ ఏఈ

మంత్రి ఉత్తమ్‌కు వినతుల వెల్లువ



ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద సమస్యలను మంత్రికి వివరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని..
- ముంపు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలి

ధరూరు: రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి మండలంలో సుడిగాలి పర్యటన సందర్భంగా పలు సమస్యలపై నాయకులు వినతులు అందజేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన పలు రిజర్వాయర్లు, పలు ప్యాకేజీల్లో ఉన్న పెండింగ్ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో గెలిపించిన నడిగడ్డ ప్రజలకు ప్రభుత్వమే న్యాయం చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత మంత్రికి వినతిపత్రం అందజేశారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు అనుబంధంగా ఉన్న ర్యాలంపాడు, సంగాల, ముచ్చోనిపల్లి, నాగర్‌దొడ్డి తదితర రిజర్వాయర్ల పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు 98బీ, 99సీ, 99డీ, 100వ ప్యాకేజీల్లో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు దాదాపు రూ.231 కోట్లు అవసరమవుతాయని, అందుకు సాగు నీటి శాఖ అధికారులు నివేదికలు ఇవ్వడం జరిగిందని అందులో పేర్కొన్నారు. చీఫ్ ఇంజినీర్ కార్యాలయంతో పాటు దాని అనుబంధ ఆఫీసులను వనపర్తికి తరలించారని, నడిగడ్డలోని సాగు నీటి ప్రాజెక్టులను దృష్టిలో ఉంచుకుని వాటిని తిరిగి గద్వాలకు తీసుకు రావాలని కోరారు.

ముంపు గ్రామ ప్రజల వినతి..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కింద ముంపు గ్రామాలైన ఉప్పేరు, రేవులపల్లి గ్రామాల పునరావాస ప్రజలు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్లు, ప్లాట్లు ఇవ్వాలని వినతి ప్రతం అందజేశారు. గద్వాల నుంచి జూరాల డ్యాం రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు.

- మధ్యాహ్నం 12.25 గంటలకు గద్వాల హెలిప్యాడ్‌కు చేరుకున్న మంత్రి
- సాయంత్రం 3.15 నిమిషాలకు జూరాల వద్ద కార్యక్రమం ముగించారు.
- గద్వాలలో ప్రెస్‌మీట్ పూర్తి అయ్యింది.
- గద్వాల నుంచి కాన్వాయ్ ద్వారా మధ్యాహ్నం ఒంటి గంటకు ర్యాపాడు రిజర్వాయర్ చేరుకున్నారు.
- రిజర్వాయర్ నీటి మట్టం వివరాలను ఇరిగేషన్‌శాఖ అధికారులను అడిగి తెలుకున్నారు.
- లీకేజీ కారణంగా 4 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌లో 2 టీఎంసీలను మాత్రమే నింపుతున్నామని తెలిపారు.
- 2.20 గంటలకు ధరూరు మీదుగా జూరాలకు చేరుకున్నారు.
- 2.35 గంటల వరకు ఫ్లడ్ కంట్రోల్ రూంలో అధికారులతో కలిసి తేనీటి విందు, ప్రాజెక్టు వద్ద సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
- 3.40 గంటలకు క్రస్టు గేట్ల రోఫ్ తెగిపోయిన ప్రాంతాలను క్షుణ్ణంగా మంత్రి పరిశీలించారు.
- 3.40 గంటలకు డ్యాంపై పరిశీలన సమయంలో సరిత వర్గీయులు పెద్ద ఎత్తున 'జై సరితమ్మ, సరితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి, జై ఉత్తం కుమార్‌రెడ్డి' అంటూ నినాదాలు చేశారు.
- మంత్రి వాకిటి శ్రీహరి కలుగ జేసుకుని నినాదాలు చేస్తున్న వారిని నిలువరించారు. తెలంగాణలోని 4 కోట్ల మంది ప్రజలకు సన్న బియ్యం అందించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి జై అనిపించారు.
- అనంతరం 3.15 గంటలకు జూరాల వద్ద నుంచి గద్వాలకు బయలుదేరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అయిజ: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. పుస్తకాలు, నోట్ బుక్స్ తదితర వస్తువుల పేరుతో దోపిడీ చేస్తున్న పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రైవేటు పాఠశాలల దోపిడీని ఎంఈఓ అడ్డుకోవడం లేదని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, బీఆర్ఎస్ యువజన సమన్వయ కర్త మల్లికార్జున్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ



పీవీ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: దివంగత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరిత ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన మహానుబావుడు, దేశానికే గొప్ప నాయకత్వం అందించి పాలనలో చెరగని ముద్రవేసిన నేత పీవీ అని కొనియాడారు. భూ సంస్కరణల చట్టం తీసుకొచ్చి ఎంతో మంది నిరుపేదలకు తన భూములన్నింటిని దానం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌రావు, మధుసూదన్‌బాబు, ఇసాక్, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, పులిపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివంగత ప్రధాని పీవీ జయంతి

ఎర్రవల్లి: మండల కేంద్రంలో శనివారం దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ కూడలిలో నాయకులతో కలిసి పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించిన తెలుగు జాతి ముద్దుబిడ్డ అని ఆయన సేవలను కొనియాడారు. నాయకులు జోగుల రవి, మద్దిలేటి, నర్సింహులు, వెంకటన్న, నర్సింహారెడ్డి, బజారన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

గ్రామాల్లో మహిళా సంఘాలే కీలకం



సంఘాలకు సంబంధించిన కర పత్రాలతో లీడర్లు

గట్టు: గ్రామాల్లో మహిళా సంఘాలే కీలకమని ఐబీ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ భీమయ్య తెలిపారు. శనివారం గట్టులోని ఐకేపీ కార్యాలయంలో వివిధ గ్రామాల సంఘం లీడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులు పాటు శిక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ గ్రామ సంఘం ద్వారా తమ సంఘాల సభ్యులు అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామ సంఘం నిర్మాణం, సమావేశాలు, నిర్వాహన, మహాసభ, పాలక వర్గం వారి విధులు, బాధ్యతలు, సేవలు వంటి అంశాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందన్నారు. గతంలో పదాధికారులుగా పని చేసిన, విశేష అనుభవం ఉన్న వారితో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సంఘాలు మరింత పటిష్టం కావాలని, సంఘాలను సమర్ధవంతంగా నిర్వహించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం గ్రామ సంఘాల లీడర్లకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ కర్ణాకర్, ఏపీడీ నర్సింహ, డీపీఏ రాంమ్మూర్తి, ఇన్‌చార్జి ఏపీఎం జయాకర్, సీసీలు ఏ జ్యోతి, రామకృష్ణ, శివ కుమార్, ఆంజనేయులు, దేవదాసు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

గట్టు: ఐఎఫ్‌టీయూ భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాష, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమిచెడు కార్తీక్‌లు కోరారు. శనివారం గట్టు గ్రామ పంచాయతీ దగ్గర ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వచ్చే నెల 2న 4వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు దానయ్య, గ్రామస్తులు శాంతన్న, రఘు, నర్సింహులు, గోవిందు, నర్సింహులు, మల్దకల్, తిమ్మప్ప పాల్గొన్నారు.

బీజేపీ రచ్చబండ కార్యక్రమం

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలోని రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగప్ప, శంకర్ నాయక్, భాస్కర్‌రెడ్డి, ప్రభు, లక్ష్మారెడ్డి, పూజారి మహదేవ్, కండప్ప ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

ధరూరు: పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామర్థ్యాలను మండల ఎంఈఓ రవీంద్ర బాబు పరిశీలించారు. శనివారం ఆయన మండలంలోని చింతరేవులలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

మహాసభలను విజయవంతం చేయండి

అయిజ: జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో జూలై 2న నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ముందు మహా సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా అమలుచేస్తున్న విధానాలను అడ్డుకునేందుకు సంఘటితంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రాజు, యేసన్న, సుధాకర్, నరసింహులు దావీద్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఇటిక్యాల: సర్వేయర్ తేజశ్వర్ మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని జిల్లా గ్రంథాలయ శాఖ సంస్థ చైర్మన్ నీలీ శ్రీనివాస్, తహశీల్దార్ బద్రప్పలు అన్నారు. ఈ మేరకు శనివారం మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో కలసి కొవొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అకారణంగా సర్వేయర్ తేజేశ్వర్‌ను చంపేయడం దారుణమని, మృతికి కారకులైన వారిని చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీ నందిని, ఆర్ఐలు, ఎస్ఏలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను విస్మరించింది

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను విస్మరించిందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి స్కాలర్‌షిప్, ఫీజ్ రీయంబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఆర్థిక స్థోమతలేని విద్యార్థులు పై చదువులకు వెళ్లలేని స్థితిలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరుగకుంటే విద్యార్థుల తరపున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్ గౌడ్, మహేష్, రాజు, నరేష్, ఫరీద్, వెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

మల్దకల్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మిషన్ ఇంద్రధనస్సు రాష్ట్ర అధికారి డాక్టర్ ఆజహార్ వైద్య సిబ్బంది సూచించారు. శనివారం మండల కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో వైద్య సిబ్బంది చేపట్టి కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం వైద్యసిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూపారాణి సూపర్‌వైజర్‌లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

గద్వాల: జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో, ఉపాధిహామీ పథకంలో కొనసాగుతున్న వివిధ రకాల పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పనిని సమయానికి చేస్తూనే నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వాహణలో పూర్తిగా పారదర్శకత, సమన్వయం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు మేలు చేకూర్చే విధంగా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ, డీఈలు, ఉపాధి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు.. జిల్లాలోని ప్రతిగ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా అధికారులు సిబ్బంది పూర్తి బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. త్వరలోనే కేంద్రప్రభుత్వ బృందాలు గ్రామాలను సందర్శించనున్నాయని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రత, పాటించి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతిరోజు ప్రతిగ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణం, తడి పొడి చెత్తల నిర్వాహణ, వంటివి సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, పీఎస్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి

కేటీదొడ్డి: విద్యార్థులు రోజూ చదివేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ వెంకటేశ్వర్ రావు అన్నారు. శనివారం మండలంలోని రంగాపురం, మైలగడ్డ, గంగన్‌పల్లి పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మోనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యబోధన అందించాలని కోరారు. విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



కొండాపురం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

నేడు నందిన్నెలో నవగ్రహాల ఊరేగింపు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె గ్రామంలోని శ్రీగురు శంభు లింగేశ్వర మఠం నందు నూతన జ్యోతిర్లింగ ఆలయం నిర్మాణం ఏర్పాటు చేశారు. ఆలయానికి కర్నూల్ జిల్లా ఆర్లగడ్డలో నుంచి 12 జోతిర్లింగాలు, గణపతి, నవగ్రహాలు ఆదివారం తీసుకొస్తున్న సందర్భంగా గ్రామపెద్దలు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సవారమ్మ ఆలయం నుంచి మఠం దగ్గరికి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శంభులింగ స్వామి తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి మహిళలు హారతులు, భజన, డోలు వాయిద్యాలతో స్వాగతం పలికి ఊరేగింపును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు ఉన్నారు.



నవగ్రహాల ఊరేగింపు సందర్భంగా సమావేశంలో పాల్గొన్న శంభులింగస్వామి

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలి

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక



ఎల్కూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక

మల్దకల్: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసి వారి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఎల్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేసి వారి మేధాశక్తిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలన్నారు. చదువుకోవడం ద్వారానే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి, వారి చదువుపట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.